ఉచిత వైద్య శిబిరానికి స్పందన


పరీక్షలు చేయించుకుంటున్న డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్

మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డినగర్‌లో డాక్టర్ పోతన్న జ్ఞాపకార్థం శ్రీ చంద్ర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై పారంభించారు. అనంతరం ఆయనతో పాటు ఇతరులకు బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు చేసి అవసరమున్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పోతన్న కుటుంబ సభ్యులతో పాటు సోమ శ్రీనివాస్‌గుప్తా, డాక్టర్లు సరితరెడ్డి, సుస్మితరెడ్డి, షోయబ్, సౌమ్యశ్రీ, ఉప్పల్ శ్రీను, వెంకటరమణగుప్తా, అశోక్‌కుమార్, సంతుగౌడ్, విజయ్, బొంబాయి రవి, గోపాల్‌నాయక్, రాము, కురుమప్ప, మధుసూదన్‌రెడ్డి, వైద్యులు కృష్ణ, కుమార్, రామకృష్ణ, మురళీ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు నేడే ఆఖరు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రవేశ పరీక్ష ఆధారిత డిప్లొమో, పోస్టుగాడ్యుయేట్, డాక్టోరల్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులను సమర్పించడానికి సోమవారం చివరి తేదీ. ప్రవేశ పరీక్షలను జూన్ 12,13,14 తేదీలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ (కంప్యూటర్‌సైన్స్, ఎంఎడ్, మాస్టర్ ఆఫ్ లా, బీటెక్ (కంప్యూటర్‌సైన్స్) ఎల్ఎల్‌బి, బీఎడ్, డీఎల్ఎడ్, పాలిటెక్నిక్ డిప్లొమోలలో ప్రవేశాలు అందిస్తారు, వివిధ పీహెచ్‌డీ కోర్సులకు కూడా దరఖాస్తులు కోరుతున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వెబ్‌సైట్‌లో చూసి దరఖాస్తును పూర్తి చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. మరిన్ని వివరాలకు 040-23006612 ఎక్స్‌టెన్షన్ 1801ను సంప్రదించాలి.

ప్రేమ పేరుతో వేధింపులు

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య


నిందితుడు రవి

శంషాబాద్ రూరల్: ప్రేమ పేరిట వేధింపులు భరించలేక ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని పెద్దతూప్రలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వి.జంగయ్య, అనిత దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు దివ్య(16)ను అదే గ్రామానికి చెందిన తెలగమల్ల రవి ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 16న రాత్రి భోజనం చేసిన తర్వాత అందరూ రెండో అంతస్తులో నిద్రకు ఉపక్రమించారు. అదే రోజు రాత్రి దివ్య సెల్‌ఫోన్ తీసుకుని కింద అంతస్తులోకి వెళ్లింది. ఎంతసేపటికి పైకి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా గది లోపలి నుంచి గడియపెట్టి ఉన్నది. దీంతో కిటికీ నుంచి లోపలికి చూడగా.. దివ్య చున్నీతో పైకప్పు ఉక్కుకు ఉరేసుకుని కనిపించింది. తలుపులు తెరిచి లోనికి వెళ్లి చూసేసరికి అప్పటికే మృతి చెందింది. రవి వేధింపులతోనే ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి రవిని అదుపులోకి తీసుకున్నారు.

సెక్యూరిటీ గార్డు అదృశ్యం


రాజు

శంషాబాద్ రూరల్: ఫాంహౌజ్‌లో పని చేస్తున్న ఓ సెక్యూరిటీ గార్డు అదృశ్యమైన ఘటన మండలపరిధిలోని కవేలిగూడలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అసోం రాష్ట్రం కచార్ జిల్లాకు చెందిన రాజు తంతి(42) ఉపాధి కోసం వచ్చి కవేలిగూడలో దామోదర్‌రావుకు చెందిన గ్రీన్‌వుడ్ ఫాంహౌజ్‌లో 7 నెలలుగా సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఇతనితో పాటు రాకేశ్ అనే వ్యక్తి కూడా పని చేస్తూ ఇద్దరు కలిసి అక్కడే నివాసముంటున్నారు. ఈ క్రమంలో ఈనెల 10న రాజు గదికి తాళం వేసి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. 2 రోజుల తర్వాత విషయం రాజు సోదరుడు బీజుకు తెలియడంతో పలుచోట్ల ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉచిత ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

శాలిబండ: ఖాజీపురాలోని సయ్యద్ మంజిల్‌లో ఈనెల 19న ఉచిత ఆధార్ కార్డు క్యాంపును ప్రారంభించనున్నట్లు ఖాద్రియా ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ అహ్మద్ హుస్సేనీ సయ్యద్ ఖాద్రీ తెలిపారు. ఖాద్రియా ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ భారత ప్రభుత్వ ఇండియా పోస్ట్ సహకారంతో ఆధార్ కార్డు క్యాంపును నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 19న ఆధార్ కార్డు నమోదు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు..ప్రతిరోజు 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని చేస్తుందన్నారు.


మణికొండ పైప్‌లైన్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు


హోర్డింగ్ పోల్‌ను ఢీకొట్టిన కారు (ఫైల్)


మణికొండ-ఖాజాగూడ రోడ్డు పార్కు స్థలంలో ప్రైవేట్ హోర్డింగ్‌లు

అడ్డగోలు హోర్డింగ్‌లు.. ప్రాణాలతో చెలగాటం..!

- వరుస ప్రమాదాలకు కారణమవుతున్న హోర్డింగ్‌లు
- పట్టించుకోని అధికారులు, చోద్యం చూస్తున్న హైడ్రా
- తొలగించాలంటున్న ప్రయాణికులు


నార్సింగి ప్రధాన రోడ్డుపై సెంటర్‌పోల్స్ హోర్డింగ్‌లు

మణికొండ: మున్సిపాలిటీల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన అడ్డగోలు హోర్డింగ్‌లు వరుస ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఓ వివాహ వేడుకల్లో పాల్గొని కారులో తిరిగిస్తున్న ఇద్దరు వైద్యులు నార్సింగి మున్సిపాలిటీ ఖానాపూర్ వద్దకు రాగానే రోడ్డు కనిపించక మధ్యలో ఉన్న హోర్డింగ్ పోల్‌ను ఢీకొట్టారు. దాంతో ఓ డాక్టర్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో వైద్యుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మరణించాడు. వికారాబాద్ నుంచి వస్తున్న మరో కారు సీబీఐటీ వద్దకు రాగానే రోడ్డు మధ్యలోని హోర్డింగ్ పోల్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వరుసగా జనాలు చనిపోతున్నా, గాయాల పాలవుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని నార్సింగి మున్సిపాలిటీ వాసులు వాపోతున్నారు. రోడ్ల పక్కన, మధ్యలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, లాలీపాప్, సెంటర్‌పోల్స్, భవనాలపై ఏర్పాటు చేసే సైన్ బోర్డులు లాంటి వాటితో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని తొలగించాలని ఉన్నత న్యాయస్థానాలు గతంలోనే ఆదేశాలు ఇచ్చాయి. వాటిని దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు, కార్పొరేషన్లు పాటిస్తున్నాయి. హైదరాబాద్‌నూ ఆ నిబంధనలు అమల్లో ఉన్నాయి. అదే శివారు మున్సిపాలిటీల్లోకి వచ్చేసరికి వాటికి తిలోదకాలు ఇచ్చి అధికారులు ఇష్టారాజ్యంగా వాటిని ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు జారీ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గత సంవత్సరం మార్చి నెలాఖరుతో వాటి గడువు తీరినా ఇప్పటివరకు వాటిని తొలగించడంలో అధికారులు విఫలం అవుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

ఒకే నిబంధన వర్తించదా..?

పక్కనే ఉన్న శంషాబాద్ మున్సిపాలిటీలోని హోర్డింగ్‌లను ఇటీవల హైడ్రా అధికారులు తొలగించారు. దానిపక్కనే ఉన్న నార్సింగి, మణికొండ, బండ్లగూడ లాంటి మున్సిపాలిటీలను మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మున్సిపాలిటీల్లో గతంలో పనిచేసిన అధికారులు హోర్డింగ్ నిర్వాహకులు ఇచ్చే డబ్బుకు ఆశపడి ఇష్టారాజ్యంగా, నిబంధనలకు విరుద్ధంగా వాటికి అనుమతులు ఇచ్చారని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. కొన్ని భవనాలపై ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు ఉధృతంగా గాలివస్తే చుట్టు పక్కనున్న ప్రజలపై పడే ప్రమాదం పొంచి ఉందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న హోర్డింగ్‌లను పూర్తిగా తొలగించి ప్రమాదాలను నివారించాలని మున్సిపాలిటీల ప్రజలు కోరుతున్నారు.

అనుమతుల్లేనివి తొలగించాం..



నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేని హోర్డింగ్‌లను ఇటీవలే తొలగించాం. మిగితా వాటికి అనుమతులు ఉన్నాయి. అవి నిబంధనల ప్రకారం కాకుండా ఎక్కువగా ఉన్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని పరిశీలించి రానున్న రోజుల్లో అలాంటి వాటికి అనుమతులు ఇవ్వం. ప్రమాదాలకు కారణమయ్యే వాటిని పరిశీలించి నోటీసులు జారీ చేసి తొలగించేలా చూస్తాం.

-టి. కృష్ణమోహన్‌రెడ్డి, కమిషనర్, నార్సింగి మున్సిపాలిటీ

మైలార్‌దేవ్‌పల్లిలో దేశభక్తి ర్యాలీ


ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత సైన్యం పాక్ ప్రేరేపిత ఉగ్ర స్థావరాలపై దాడులు చేసి నేలమట్టం చేయడంపై సేవా భారతి కిశోరి వికాస్ ఆధ్వర్యంలో ఆదివారం దేశభక్తి ర్యాలీ నిర్వహించారు. పద్మశాలీపురంలోని స్వామి వివేకానంద విగ్రహం నుంచి గణేశ్‌నగర్ బొడ్రాయి, భావన ఋషికాలనీ, ఆదర్శకాలనీ, టీఎస్‌జీఓఎస్ కాలనీ, మధుబన్ కాలనీ మార్గంలో తిరిగి స్వామి వివేకానంద విగ్రహం వద్దే ముగిసింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ.. ర్యాలీ ద్వారా యువతలో దేశభక్తి పెంపొందించడం, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సేవా భారతి కిశోరి వికాస్ సమన్వయకర్త లక్ష్మి, క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శి గొంత్యాల శ్రీనివాస్, కిశోరి వికాస్ కార్యకర్తలు అడికే శ్రావణి, ఎస్.లక్ష్మి, స్వప్న, ఝాన్సీ, విద్యార్థులు పాల్గొన్నారు.

యాగశాల భూమి పూజ ప్రారంభం



అత్తాపూర్: హైదర్‌గూడలో ఈనెల 23 నుంచి 25 వరకు నిర్వహించే శ్రీ ప్రణవ భక్త సమాజం ఏకశత పంచోత్తర మహోత్సవ కార్యక్రమంలో భాగంగా యాగశాల కోసం ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు మోంద్ర నర్సింహ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రణవ భక్త సమాజం ఉపాధ్యక్షుడు బర్ల మల్లారెడ్డి, ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, సాబాద విజయ్‌కుమార్, సభ్యులు సులిగె మహేందర్, విద్యాసాగర్, సాయియాదవ్, కిషన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మహోత్సవ పత్రాల పంపిణీ

శ్రీ ప్రణవ భక్త సమాజం సభ్యులు ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ మహోత్సవాల పత్రికలను పంపిణీ చేసి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో కాకుళారం కృష్ణ, నారగూడెం విశ్వనాథ్, బుద్ధాల నర్సింగ్, శ్రీను తదితరులు ఉన్నారు.

ఘనంగా బీరప్ప బోనాలు


మండలంలోని మల్కారంలో బొడ్రాయి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బీరప్ప బోనాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు..పోతురాజుల విన్యాసాల మధ్య మహిళల బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. -శంషాబాద్ రూరల్

'ఆషాఢ బోనాలను వైభవంగా నిర్వహిస్తాం'


గాజుల అంజయ్యను సన్మానిస్తున్న ప్రతినిధులు

చార్మినార్: ఈసారి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య పిలుపు నిచ్చారు. శనివారం రాత్రి మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ ప్రాంగణంలో ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. రొటేషన్ పద్ధతిలో వచ్చే ఉమ్మడి కమిటీ బాధ్యతలను ఈసారి అక్కన్న మాదన్న ఆలయ కమిటీకి ప్రస్తుత కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య అప్పగించారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ..ఆషాఢ మాసంలో జరిగే బోనాల జాతర ఉత్సవాలకు పాతబస్తీకి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా అంగరంగ వైభవంగా మనమంతా ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. గతంలో లాగే ఈసారి కూడా ఘనంగా నిర్వహించడానికి ఇప్పటి నుంచే శ్రీకారం చుట్టాలన్నారు. బాధ్యతలు అప్పగించిన గాజుల అంజయ్యను ఆలయాల కమిటీ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ గౌడ్, మధుసూదన్ యాదవ్, ఆదర్ల మహేష్, శశాంక్ తివారి, దినేష్, సుమన్ కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నానల్‌నగర్, కార్వాన్, లంగర్‌హౌస్ డివిజన్‌లకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకునే పథకానికి సరైన ధ్రువపత్రాలు జత చేయాలని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు అన్ని ధ్రువపత్రాలు ఉన్న ఏ ఒక్క సంక్షేమ పథకం దరఖాస్తు కూడా పెండింగ్‌లో లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ రఫత్‌హుస్సేన్, అబీబ్ చౌష్ తదితరులున్నారు.

అంతా చెత్తమయం


శాతంచెరువు కట్టపై పేరుకుపోయిన వ్యర్థాలు

గోల్కొండ: నయాకీలాలోని శాతం చెరువులో టన్నుల కొద్ది వ్యర్థాల డంపింగ్‌లపై గతంలో 'సాక్షి'లో ఎన్నో కథనాలు వచ్చాయి. ఇదిలా ఉండగా మూడు నెలల క్రితం 'సాక్షి'కథనానికి స్పందించిన బల్దియా అధికారులు శాతం చెరువుతో పాటు దాని పరిసరాల్లో వ్యర్థాల డంపింగ్ నివారణకు చెరువు వద్ద డీఆర్ఎఫ్ సిబ్బందిని నియమించారు. 24 గంటలు సెక్యూరిటీ ఉండేలా బందోబస్తు చేశారు. ఇదిలా ఉండగా కొన్ని రోజుల నుంచి చెరువు కట్ట వద్ద విధులు నిర్వహించే డీఆర్ఎఫ్ సిబ్బంది కానరావడం లేదు. వ్యర్థాల డంపింగ్ ఆపడానికి సిబ్బంది లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన కొందరు వ్యక్తులు ఆటో ట్రాలీలు, డీసీఎం వ్యాన్‌లలో వ్యర్థాలను తెచ్చి చెరువు కట్ట పొడవునా డంప్ చేస్తున్నారు. బల్దియా పారిశుద్ధ్య విభాగం వారు ఈ చెత్తను తరలించడం లేదు. ప్రతిరోజూ రాత్రి డంపింగ్ అవుతున్న వ్యర్థాలు గుట్టల్లా పేరుకుపోయాయి. వ్యర్థాలు కుళ్లి శాతం చెరువుపై నుంచి రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శాతం చెరువులో గుర్రపు డెక్క కూడా విపరీతంగా పెరిగిపోతుంది. గుర్రపు డెక్క తొలగించి వ్యర్థాలను సైతం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. చెరువు కట్ట ఇరువైపులా సెక్యూరిటీ గార్డులను నియమించాలని కోరుతున్నారు.

తవ్వారు..మరిచారు..!



గౌలిపురా: హనుమాన్‌నగర్‌లో తాగునీటి పైపులైన్ లీకేజీ పనుల కోసం తవ్విన రోడ్డును తిరిగి పూడ్చకపోవడంతో గుంతగా ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ దారిలో రాకపోకలు సాగించే స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హనుమాన్‌నగర్ నుంచి ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత కారణంగా వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రమాదకరంగా మారిన రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

లాల్‌దర్వాజా సింహవాహిని ఆలయ కమిటీ చైర్మన్ ఎన్నిక

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా బి.మారుతీ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన కమిటీ సర్వసభ్య సమావేశంలో మారుతీ యాదవ్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఐదేళ్లుగా ఆయన కమిటీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ వస్తున్నారు. త్వరలోనే మరో సమావేశం ఏర్పాటు చేసి మిగతా కార్యవర్గాన్ని ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు జి.కాశీనాథ్ గౌడ్, సి.బంగ్లా రాజు యాదవ్, కె.విష్ణుగౌడ్, కె.వెంకటేష్, ఎ.మాణిక్ ప్రభు గౌడ్, సి.వెంకటేష్, సి.రాజు కుమార్ యాదవ్, సి.రాజేందర్ యాదవ్, తిరుపతి నర్సింగ్ రావు, శీర రాజ్‌కుమార్, కన్వీనర్ జి.అరవింద్ కుమార్ గౌడ్, కోశాధికారి పోసాని సతీష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు, ఏరియా కమిటీల ఏర్పాటు హుళక్కేనా..?


రాయదుర్గంలో గచ్చిబౌలి వార్డు కమిటీ కార్యాలయం (ఫైల్)

రాయదుర్గం: వార్డు, ఏరియా కమిటీల ఏర్పాటు కలగానే మిగిలింది. జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా వార్డు, ఏరియా కమిటీలను మరింత పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, ఎక్కువ మందికి అవకాశాలు కల్పించి వీటిని మరింత పటిష్టం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అందరిలో ఆశలు రేకెత్తాయి. డివిజన్ స్థాయిలో అధికార యంత్రాంగాన్ని నియమించి గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కానీ జీహెచ్ఎంసీ పాలక మండలి ఏర్పడి నాలుగేళ్లు పైబడినా కమిటీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో డివిజన్‌లోని అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు తమకు పదవులు ఉండవా....? అని మదనపడుతున్నారు. ఇప్పటికైనా వార్డు, ఏరియా కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- గతంలో గచ్చిబౌలి డివిజన్‌లో వార్డు, ఏరియా కమిటీలలో 11 మంది వార్డు, 9 మంది ఏరియా కమిటీ సభ్యులు ఉండేవారు.
- నెలకోమారు నిర్వహించాల్సిన సమావేశాలు జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో మూడు నెలలకోమారు, ఆ తర్వాత ఏడాదిలో మొక్కుబడిగా నిర్వహించి వదిలేశారు.
- నాలుగేళ్ళుగా ఈ వార్డు కమిటీలు లేకపోవడంతో ఇక సమావేశాలే లేకుండా పోయాయి.
- గత పాలకమండలి పదవీకాలం ముగియడంతో వీరి పదవీ కాలం కూడా ముగిసినట్లయింది.ఆ తర్వాత ప్రభుత్వం మారిపోవడంతో అగమ్యగోచరంగా తయారైంది.

అప్రమత్తతే ముఖ్యం..

చదువుకున్న వారే సైబర్ బారిన పడుతున్నారు



- హాస్టళ్లలో దొంగతనాలు ఎక్కువ
- ప్రధాన కూడళ్లలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు


మాదాపూర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌నాయక్

మాదాపూర్: సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. చదువుకున్న వారే ఎక్కువగా మోసపోతున్నారని మాదాపూర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ డి.విజయ్‌నాయక్ తెలిపారు. సోషల్ మీడియా, ఫెడెక్స్ మోసాలు, రెంటల్, ఇన్‌వెస్ట్‌మెంట్, లోన్స్, బెట్టింగ్ యాప్, కస్టమర్ కేర్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల బారిన పడినపుడు సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఫోన్.1930కి.. ఇతర సమస్యలు ఎదురైతే 100కి డయల్ చేయాలని ఆయన తెలిపారు. ఈ నేరాలపై ప్రధాన కూడళ్లలో, కళాశాలల్లో, జన సమ్మర్థం ఉన్నచోట వీటిపై అవగాహన కల్పిస్తున్నాం. మాదాపూర్ డిటెక్టివ్ టీంలో 10 మంది ఉన్నారు. సైబర్ క్రైంలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నవారు ఇద్దరున్నారు. నేరాలు పెరిగిపోతున్న తరుణంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు.

ప్రశ్న: మాదాపూర్ ప్రాంతంలో ఎలాంటి నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి?

ఇన్‌స్పెక్టర్: సైబర్ నేరాలతో పాటు ఎక్కువగా హాస్టళ్లలో దొంగతనాలు జరుగుతున్నాయి. సరైన భద్రత లేకపోవడం వల్ల రూంలలోకి చొరబడి ల్యాప్‌టాప్స్, ఫోన్స్, నగదుతో పాటు ఖరీదైన వస్తువులను దొంగిలిస్తున్నారు. 24 గంటల పాటు సెక్యూరిటీని నియమించాలి. హాస్టల్‌లో ఉన్న ప్రతి ఒక్కరికి ఐడీ కార్డు ఇవ్వాలి. లోపలికి వెళ్ళేవారు తప్పని సరిగా ఐడీ కార్డులను చూపాలనే నిబంధన ఉండాలి. అప్పుడే దొంగతనాలను అరికట్టవచ్చు.

ప్ర: ఫెడెక్స్ మోసం గురించి?

జ: గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీకు ఎయిర్‌పోర్టు నుంచి పార్సిల్ వచ్చిందని అందులో డ్రగ్స్ ఉన్నాయని.. మీరు ఫలానా పోలీస్‌స్టేషన్‌కు రావాలని భయపెడతారు. కొంత సమయం తరువాత మీరు డబ్బు చెల్లిస్తే కేసు కొట్టివేస్తామని చెప్పి వారివద్ద నుంచి డబ్బు వసూలు చేసి ఫోన్‌లను స్విచ్ఛాఫ్ చేస్తారు. ఇలాంటి మోసాల బారిన విద్యావంతులేపడుతున్నారు. ఎవరికి వారు అప్రమత్తంగా ఉండాలి.

ప్ర: ట్రాన్స్‌జెండర్స్, సోషల్‌మీడియా ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులు ఏమిటి?

జ: ఖాళీ ప్రదేశాల వద్ద, ప్రధాన కూడళ్లలో ట్రాన్స్‌జెండర్స్ ఎక్కువగా ఇబ్బందులు పెడుతున్నారు. వారి ప్రలోభాలకు లోనుకాకుండా ఉండాలి. వారి వద్ద ఆగవద్దు. ఏవైనా సమస్యలు వస్తే వెంటనే 100కి డయల్ చేయాలి. అమ్మాయి, అబ్బాయిలు కలిసి ఉన్నప్పుడు తీసుకున్న ఫొటోలు వారు విడిపోయిన తరువాత మార్ఫింగ్ చేసి డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. పర్సనల్ విషయాలు ఎవరితోనూ పంచుకోవద్దు.

ప్ర: బెట్టింగ్ యాప్‌ల ద్వారా జరుగుతున్న మోసాలు ఏంటి..?

జ: ప్రస్తుతం బెట్టింగ్‌కి అలవాటు పడ్డారంటే ప్రాణాలు కోల్పోవాల్సిందే. చిన్న చిన్న బెట్టింగ్‌లు కట్టినప్పుడు తిరిగి డబ్బును చెల్లించి ఆసక్తి కలిగిస్తారు. అలవాటు అయిన తరువాత పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టినప్పుడు పోతాయి. ఇలాంటి అలవాట్లతో బంధువుల వద్ద, స్నేహితుల వద్ద అప్పులు చేస్తుంటారు. నష్టపోయాక దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. చెడు వ్యసనాలకు బానిసలై ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. బెట్టింగ్ యాప్‌ల జోలికి పోవద్దు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు